సీరియల్

# అడుగు ముందుకు వేస్తే భస్మం!




(నాలుగవ భాగము)

రామేశం తన మిత్రులతో విషయం చర్చించాడు.

"ఇంతవరకూ మామూలు యాత్రా ప్రదేశాలు చూశాం. ఇలాంటి ప్రాంతంకూడా ఒకటి చూడాలని ఉంది. మామూలుగా కార్లలో వెళ్ళిరావడంలో ఏముంది? ఇబ్బందులతో కూడిన ప్రయాణమొకటి చేయాలనివుంది..." అన్నాడు టాగూర్. మిగతా ఇద్దరూకూడా అతన్ని బలపరిచారు.

"అయితే నేనూ సిద్ధమే!" అన్నాడు రామేశం.

ఆ రాత్రికి వాళ్ళు ప్రెసిడెంటు యింట్లో విశ్రాంతి తీసుకున్నారు.

ఒక రాత్రివేళ వాళ్ళ గదిలో నలుగురికీ విచిత్రమైన అనుభూతులు కలిగాయి. ఎవరో మీదపడి తమ గొంతు నొక్కుతున్నట్లూ ఆ అటవీపుల ప్రాంతానికి వెళ్ళవద్దని గుసగుసలాడినట్లు చెవిలో చెప్పినట్లూ నలుగురికీ అనిపించింది. వాళ్ళలో ఎవ్వరు కూడా ఆ వ్యక్తుల్ని ప్రతిఘటించలేకపోయారు. ఇంకో విశేషమేమిటంటే ఆ వ్యక్తులు తెలుగువాళ్ళను తెలుగులోనూ, హిందీవాళ్ళను హిందీలోనూ హెచ్చరించాయి.

మర్నాడుదయం లేవగానే నలుగురూ ఈ విషయాన్ని ఒకరితో ఒకరు చెప్పుకుని ఆశ్చర్యపడ్డారు. ప్రెసిడెంటుకు చెబితే ఆయన రవంత కూడా ఆశ్చర్యపోలేదు.

"అక్కడ ఓ దేవత వుందంటారు. నాగరికులు తన ప్రాంతాల అడుగుపెట్టడం ఆ దేవత కిష్టముండదని అంటారు. రాత్రి మీరు పొందిన అనుభవం ఆ దేవత కారణంగానే కలిగి వుంటుంది."

"ఇదంతా నాన్సెన్స్" అన్నాడు టాకూర్. అతడికి భయానికి బదులు ఆసక్తి పెరిగింది. ఏమైనా సరే ప్రయాణం కొనసాగించాలని అతననుకున్నాడు.

రామేశానికి ప్రెసిడెంటు గురించి ఒక సందేహం వచ్చింది. అతడు పరమమూర్ఖుడేనా అయుండాలి. లేదా చాలా తెలివైన వాడయివుండాలి. రెండోది నిజమైతే ఆ కొండదారిలో ఏదో రహస్యముండివుండాలి. అదేమిటో తెలుసుకోవాలి!

"మీకు ఇప్పుడు నాన్సెన్స్‌లాగే వుంటుంది. ప్రాణాల మీదికి వచ్చినప్పుడు తెలుస్తుంది" అన్నాడు ప్రెసిడెంటు. తానన్న మాట జరిగితీరుతుందన్న నమ్మకం ప్రెసిడెంటు మాటల్లో స్పష్టంగా ధ్వనించింది.

రామేశం లి ప్తకాలంపాటు ఆలోచించి "మాకు ప్రాణ భయంలేదు. ఎందుకంటే మేము బాధ్యతగల ప్రభుత్వోద్యోగులం. మేమిక్కడ ఏదో పనిమీద వచ్చినట్లు ప్రభుత్వానికి తెలుసు. మాకే ఆపద జరిగినా భారీ ఎత్తున రక్షించడానికి ఏర్పాట్లు జరుగుతాయి. అప్పుడు ఏ దొంగ దేవతలూ వాళ్ళను ఆపలేరు. ఒకసారి తెలుసుకోవాలను కున్నాక మమ్మల్నెవ్వరూ వారించలేరు" అన్నాడు.

ప్రెసిడెంటు ముఖంలో కలవరపాటు కనబడింది— "నాకు మిమ్మల్ని చూస్తే అనుమానంగానే వుంది. ఈ విషయం ముందే చెప్పాల్సింది. ఇప్పుడైనా మించిపోయింది లేదు. మీ ప్రయాణానికి నేను ఏర్పాట్లు చేయిస్తాను. ఆపైన భగవంతుడే వున్నాడు. ఎటొచ్చీ ఈలోగా నేనీ ఊళ్ళోని యితర పెద్దల్ని సంప్రదించాలి. మేము మొత్తం పదిమందిమి."

రామేశం ఆశ్చర్యంగా "మీ ఊరికీ ఆ కొండదారికీ సంబంధమేమిటి? ఎవరైనా ఆ కొండదారిలో వెళ్ళాలను కుంటే ఊళ్ళోని పదిమంది పెద్దలు కలిసి సంప్రదించాల్సిన ఆవశ్యకత ఎందుకొచ్చింది?" అనడిగాడు.

"నాగరికుల రాకను ఆటవికులు హర్షించరు. మా సహకారం ఉంటేతప్ప ఆ కొండదారిలో వెళ్ళి ఆటవికుల ప్రాంతంచేరడం ఎవ్వరికీ సాధ్యపడదు. అందువల్ల నాగరికులు వాళ్ళను జేరితే అందుకు మాదే బాధ్యతగా భావించి మా ఊరిమీద మెరుపుదాడి చేస్తారు ఆటవికులు. ఆ దాడి మేము భరించలేము. అందుకే ఊళ్ళోని పెద్దలు కొందరు కలిసి కొన్ని ఏర్పాట్లు చేశాము..." అన్నాడు ప్రెసిడెంటు.

ఆయన ముఖం చూస్తేనే రామేశానికి అనుమానాలు పెరుగుతున్నాయి. ఏదో సరదాగా ఓ ఆటవిక ప్రాంతాన్ని చూద్దామనుకుంటూంటే వ్యవహారమింత కాంప్లికేటెడ్ గా తయారవుతుందని ఆయన అనుకోలేదు.

ప్రెసిడెంటు ఊరిపెద్దలందరకూ కబురంపించాడు. కరణం, మునసబు, గ్రామపురోహితుడు, పెద్ద షావుకార్లిద్దరు, డాక్టర్లిద్దరూ, ఇద్దరు భూస్వాములు ప్రెసిడెంటు గారిల్లు చేరారు. ప్రెసిడెంటు చెప్పిందంతా విన్నాక ఒకొక్కరే రామేశం బృందానికి హితవు చెప్పడానికి ప్రయత్నించారు. వాళ్ళు వినరని తెలిసేక ఊరి పెద్దలందరూ రహస్యంగా చాలాసేపు చర్చించారు. చర్చలన్నీ అయ్యేక "రెండు రోజులు గడువు కావాలి మాకు" అన్నాడు ప్రెసిడెంటు.

రామేశం అనుమానాలు బలపడ్డాయి. ఈ రెండు రోజుల్లోనూ ప్రెసిడెంటు బృందం తమను అనుమతిస్తారన్న నమ్మకం లేదు. ఇక తామే స్వతంత్రించాలి.
ఆ విషయం తనవాళ్ళతో సంప్రదించాడు.

"ప్రమాదాలంటే నాకు భయంలేదు. ఈ రోజే ఆ మాటకొస్తే ఈ క్షణంలోనే బయల్దేరాలని నాకుంది. అనవసరంగా రెండురోజులు వేస్ట్ చేయకూడదనుకుంటున్నాను" అన్నాడు టాకూర్. శౌరి, జోగారావు కూడా ఆ మాటలకు వత్తాసు పలికారు.

అందరూ చిన్నయ్య హోటల్లో భోంచేశారు. కారు అవసరం లేకపోయినా టాక్సీవాలా తన టాక్సీని చిన్నయ్య సంరక్షణకు వదిలి వీళ్ళతో బయల్దేరి రావడానికి తయారయ్యాడు.

“మొత్తం అయిదుగురం! నిరాయుధులమై ప్రమాదకరమైనదిగా చెప్పబడుతున్న ప్రాంతానికి వెడుతున్నాం. అదీ ప్రమాదకరమైన పరిస్థితుల్లో” అన్నాడు రామేశం.

“మనమంతా ప్రమాదాన్ని ఎదుర్కోవాలి తప్పితే ఇక మీదట ప్రమాదం గురించి ఆలోచించకూడదు, మాట్లాడకూడదు” అన్నాడు టాక్సీవాలా. అందరికంటే అతడి ఉత్సాహం అధికంగా కనబడుతోంది.

“మనకెవ్వరూ దారిచూపక్కరలేదు. సాయం చేయనక్కరలేదు. ఒకరి అనుమతితో మనకు నిమిత్తం లేదు. బయల్దేరి పోదాం.” అన్నాడు జోహారీ.

చిన్నయ్య హోటల్లోంచి రెండురోజులకు సరిపడ పదార్థాలు కొనుక్కున్నారు. అన్నీ రెండు సంచులలోకి తరలించారు. ఊరు చూడ్డానికి బయల్దేరినట్లుగా అయిదుగురూ కదిలారు.

కాసేపు పొలాల్లో మసిలి నెమ్మదిగా తమ మార్గాని కొండవేపు మళ్ళించారు. కొండను సమీపించగా వారికి సన్నని కాలిబాట కనబడింది. ఆ కాలిబాటల అయిదుగురూ ఒకరి వెనుక ఒకరుగా నడుస్తున్నారు. క్రమంగా వారి నడక వేగం హెచ్చింది.

మొదటి రెండు కిలోమీటర్ల దూరంలో వాళ్ళకేమీ విశేషాలు ఎదురుకాలేదు. దారికికూడా అటూయిటూ రాళ్ళే కనబడుతూ వచ్చాయి. ఆ తర్వాతనుంచి మాత్రం మార్గం నెమ్మదిగా అరణ్యంలోకి దారితీసింది.

వారిదారి తిన్నగా లేదు. రకరకాలుగా మెలికలు తిరుగుతోంది. ఆ కాలిబాట గుర్తులేకపోతే— తామేదారిన వెడుతున్నదీ తెలుసుకోడం చాలా కష్టం.

(సశేషం)